# 'సీక్రెట్ వార్'పై యూట్యూబ్ నిషేధం

## కేంద్రం ఆదేశించడంతోనే నన్న సంస్థ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): 'ఆస్ట్రేలియాలోకి చొరబాటుదారులు– ఇండియా సీక్రెట్ వార్' పేరిట ఆస్ట్రేలియాకు చెందిన ఏబీసీ టీవీ రూపొందించిన ఓ డాక్యుమెంటరీ ప్రసారాన్ని భారత్‌లో యూట్యూబ్ నిషేధించింది. కేంద్రప్రభుత్వం ఆదేశించడంతోనే తాము ఈ నిర్ణయం తీసుకొన్నట్టు ఓ ప్రకటనలో తెలిపింది. ఆస్ట్రేలియాలోని కొందరు సిక్కులను లక్ష్యంగా చేసుకొని ఇండియన్ ఇంటెలిజెన్స్‌కు చెందిన కొన్ని ఏజెన్సీలు పనిచేస్తున్నట్టు ఈ డాక్యుమెంటరీలో పేర్కొన్నారు. లక్షిత వర్గం ఖలిస్థానీ ఉద్యమానికి సానుకూలంగా ఉండటంతో పాటు మోదీ ప్రభుత్వాన్ని పలుమార్లు విమర్శించినట్టు వెల్లడించారు. ఈ కారణంగానే ఈ డాక్యుమెంటరీని భారత్‌లో నిషేధించినట్టు తెలుస్తున్నది. కాగా, హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య, గోద్రా అల్లర్లకు సంబంధించిన బీబీసీ డాక్యుమెంటరీని కూడా గతంలో కేంద్రం నిషేధించడం తెలిసిందే.

# ప్రజ్వల్ లైంగిక వేధింపుల వీడియోలు అసలైనవే

## ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ నిర్ధారణ

బెంగళూరు: జేడీఎస్ మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ లైంగిక వేధింపుల వీడియోలన్నీ అసలైనవేనని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ నిర్ధారించింది. ఆ వీడియోలేవీ ఎడిట్ చేసిన, మార్ఫింగ్ చేసిన, తప్పుడు వీడియోలు కాదని స్పష్టం చేసింది. వీడియోలో ఉన్న వ్యక్తి భౌతిక లక్షణాలు ప్రజ్వల్ రేవణ్ణను చాలా దగ్గరగా పోలి ఉన్నాయని తెలిపింది. ఈ మేరకు సిట్‌కు నివేదిక సమర్పించింది. ఇప్పటి వరకు ప్రజ్వల్‌పై మూడు కేసులు నమోదయ్యాయి.



కర్ణాటక కాంగ్రెస్ ఎంపీ సునీల్ బోస్ గత నెల 26న మైసూర్‌లో తనతో పాటు కలిసి పూజలు నిర్వహించిన కేఏఎస్ అధికారిణి సవిత నుదుటన కుంకుమ బొట్టు పెట్టడం వివాదస్పదంగా మారింది. దీనిపై స్పందించడానికి ఎంపీ నిరాకరించారు.

# 50 వేల కోట్లతో 8 హైస్పీడ్ రోడ్ కారిడార్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 2: దేశంలో ఎనిమిది హైస్పీడ్ రోడ్ కారిడార్ ప్రాజెక్టులకు కేంద్ర మంత్రివర్గం శుక్రవారం ఆమోదం తెలిపింది. 936 కి.మీ పొడవున రూ.50,665 కోట్లతో చేపట్టే ఈ ప్రాజెక్టుల వల్ల దేశంలోని పలు ప్రాంతాలకు అనుసంధానత ఏర్పడి, రవాణా వ్యవస్థ మెరుగుపడుతుందని అధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టుల్లో భాగంగా ఆరు వరుసలతో ఆగ్రా–గ్వాలియర్ నేషనల్ హై స్పీడ్ కారిడార్, నాలుగు వరుసలతో ఖరగ్‌పూర్–మోరెగ్రామ్ నేషనల్ హైస్పీడ్ కారిడార్, ఆరు వరుసలతో తరడ్–దీసా–మెహ్‌సనా–అహ్మదాబాద్ నేషనల్ హైస్పీడ్ కారిడార్, నాలుగు వరుసలతో అయోధ్య రింగ్ రోడ్, నాలుగు వరుసలతో రాయ్‌పూర్–రాంచీ నేషనల్ హైస్పీడ్ కారిడార్, ఆరు వరుసలతో కాన్పూర్ రింగ్ రోడ్‌ను నిర్మిస్తారు.

# డెమోక్రటిక్ అభ్యర్థిగా కమలాహారిస్ ఖరారు



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రటిక్ తరఫున అధ్యక్ష అభ్యర్థిగా కమలాహారిస్ పేరు ఖరారైంది. ఈ మేరకు అధ్యక్ష అభ్యర్థిత్వానికి అవసరమైన ఓట్లు ఆమెకు లభించినట్టు డెమోక్రటిక్ నేషనల్ కమిటీ శుక్రవారం ప్రకటించింది. 4 వేల మంది డెలిగేట్లు ఆమె అభ్యర్థిత్వాన్ని బలపరిచినట్టు వెల్లడించింది. అధ్యక్ష ఎన్నికల్లో ఆమె రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఢీకొననున్నారు. ఈ ఏడాది నవంబర్‌లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరుగనున్నాయి.




















